# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు






సంపుటి : 01 | సంచిక : 288 | వరంగల్ | శుక్రవారం, 21 ఆగస్టు 2026 | పేజీలు : 02


# భూసారాన్ని పెంపొందించే పంటలు సాగు చేయాలి

- రైతులకు మార్కెట్ అవకాశాలు కల్పించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- నర్మెట్ట మండలంలోని ఇప్పలగడ్డలో రైతుల పంటలను పరిశీలించిన కలెక్టర్



**పాలకుర్తి వాణి, నర్మెట :** భూసారాన్ని పెంపొందించే పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం, జిల్లాలోని నర్మెట్ట మండలం, ఇప్పలగడ్డ గ్రామంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రైతుల పంటలను సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాగు విధానాలు, పంటల దిగుబడి, మార్కెటింగ్ సౌకర్యాలు, సాగునీటి వసతులు, తదితర అంశాలపై రైతులతో నేరుగా మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు బండి రామలింగం సాగు చేస్తున్న భూమిని కలెక్టర్ పరిశీలించారు. సుమారు 3.5 ఎకరాల విస్తీర్ణంలో మిర్చి, టమోటా, కాకరకాయ, కందులు, తదితర పంటలను సాగు చేస్తున్నట్లు రైతు, కలెక్టర్‌కు వివరించారు. పంటల సాగుకు చేస్తున్న పెట్టుబడి, అందుతున్న దిగుబడి, పంటల ద్వారా లభిస్తున్న ఆదాయం, పంటల నిర్వహణ విధానం, సాగునీటి లభ్యత, మార్కెట్లో పంటలకు లభిస్తున్న ధరలు, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులు పంటల సాగులో నేల స్వభావం, భూసార పరీక్షల ఫలితాలు, నీటి లభ్యత, మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని, పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఒకే రకమైన పంటపై ఆధారపడకుండా, పంటల వైవిధ్యాన్ని పాటించడం ద్వారా ఆదాయ మార్గాలను పెంచుకోవచ్చని తెలిపారు. పంటలలో అంతర పంటలు, భూసారాన్ని మెరుగుపరిచే పంటలను సాగు చేయడం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు భవిష్యత్‌లో పంటల దిగుబడికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం మరో రైతుకు చెందిన ఒక ఎకరం పొలంలో సాగు చేస్తున్న మిర్చి, పెసర్ల పంటలను కలెక్టర్ పరిశీలించారు. గతంలో ఈ భూమిలో పుచ్చకాయ సాగు చేసినట్లు, ప్రస్తుతం మిర్చి, పెసర్లు సాగు చేస్తున్నట్లు రైతు, కలెక్టర్ కు వివరించారు. భూమిలో సేంద్రియ పదార్థాలను పెంచే, నేలకు పోషకాలను అందించే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా పప్పుధాన్యాల సాగు ద్వారా భూసారం పెంపొందించడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం లభించేలా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు.

### కేంద్ర వంటశాలలకు స్థానిక రైతుల నుంచి కూరగాయల సేకరణకు అవకాశం

రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రస్తుతం పండిస్తున్న కూరగాయలకు మార్కెట్ సౌకర్యం ఎలా ఉంది, పంటలను ఎక్కడ విక్రయిస్తున్నారు, రైతులకు నేరుగా మార్కెట్ లభిస్తుందా? అనే అంశాలపై ఆరా తీశారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న కేంద్ర వంటశాలలకు అవసరమైన కూరగాయలను స్థానికంగా రైతుల నుంచి సేకరించే అవకాశాలను పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల రైతులకు తమ పంటలకు స్థిరమైన మార్కెట్ లభించడంతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర వంటశాలలకు అవసరమైన కూరగాయల సరఫరాలో రైతులకు సమాన అవకాశాలు కల్పించేలా పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంటల సాగుకు ముందే మార్కెట్ డిమాండ్‌ను అంచనా వేసి, సాగు ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదేశం

పర్యటన సందర్భంగా రైతులు తమ వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కలెక్టర్ అక్కడి నుంచే సంబంధిత ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడి, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో డీఏఓ అంబికా సోనీ, ఇతర సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


WANTED

విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745





# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరనీయం

- **బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ**
- **మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోగు శ్రీనివాస్**

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** స్వర్గీయ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి ని పురస్కరించుకొని పాలకుర్తి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ,మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోగు శ్రీనివాస్ అధ్యక్షతన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. మాట్లాడుతూ ఆగస్టు 20న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా సద్భావనా దివస్‌ను నిర్వహిస్తారని తెలిపారు. యువతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేయడంలో, దేశంలో ఆధునిక సమాచార సాంకేతికతకు పునాది వేయడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధి, విద్యా రంగంలో ఆధునికీకరణకు ఆయన ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు కారుపోతుల శ్రీనివాస్ గౌడ్ , జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండి.మధార్, కార్యదర్శి పెనుగొండ రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గాదెపాక భాస్కర్, బీసీ సెల్ అధ్యక్షులు ఐలేష్ యాదవ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు లావుడియా భాస్కర్, మండల నాయకులు కమ్మగని నాగయ్య గౌడు,పన్నీరు వెంకన్న, భూమా రంగయ్య, సోమల్లయ్య, సుధాకర్ రెడ్డి, మైనార్టీ నాయకులు సలీమ్, అబ్బసలీ, కిషన్ నాయక్, సురేష్, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.




# క్లాస్ టాపర్స్ కి పారితోషకం

**పాలకుర్తి వాణి, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ మండలం తాటికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుండి 10వ తరగతి విద్యార్థులకి FA1 పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు శివకేశ్వర్ 10వ, సంతోష్ 9వ, శాన్వి 8వ,అభిరామ్ 7వ, అశ్విత 6వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున 5000 రూపాయలను వరంగల్ కి చెందిన దుర్గా సిరామిక్స్ అధినేత వడ్లమూడి యాక నారాయణ అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి నెల పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ఈ విద్యా సంవత్సరం ముగిసే వరకు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ పారితోషకాన్ని గ్రామ సర్పంచ్ మారపాక సుజన,పాఠశాల చైర్మన్ బేతి మంజుల ఉపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్,చైర్మన్, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు యాక నారాయణ కి కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకొని మంచి మార్కులు సాధించి ఈ పారితోషకాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్ర, లింగమూర్తి, రంజిత్ కుమార్, శ్రీనివాస్, మురళి, కృప, సలావుద్దీన్, పీడీ గిరెడ్డి ప్రమోద్ రెడ్డి, సోమేశ్వరి, జగదీష్ పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**పాలకుర్తి వాణి, జనగామ :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గెత్సేమనే ప్రార్థన మందిరం సీనియర్ సంఘకాపరి బ్రదర్ రవిపాల్ పిలుపునిచ్చారు. జనగామ పట్టణం ప్రగతినగర్‌లో సొసైటీ ఆఫ్ క్రైస్ట్ కరుణాపురం 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సొసైటీ ఫౌండర్ డాక్టర్ సంగాల పాల్సన్ రాజ్, డైరెక్టర్ డాక్టర్ జయప్రకాశ్ గోపు నిర్వహణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ రవిపాల్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత లోపించడంతో మానవాళి మనుగడకే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని వృక్షాలుగా పెంచే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గెత్సేమనే ప్రార్థన మందిరం సంఘకాపరి బ్రదర్ హనోకు, శ్రీకాంత్, సామాజికవేత్త జి. కృష్ణ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఇనుముల నర్సయ్య, సంఘ అధ్యక్షుడు మెకానిక్ రవి, ప్రధాన కార్యదర్శి కాగితాల రవి, సంఘ పెద్దలు ఎం. రాజు, కొంపెల్లి రామచంద్రం, కె. సిద్ధారెడ్డి, మేకల నరేష్, గుగులోతు బాలాజీ పాల్గొన్నారు.




# ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

**పాలకుర్తి వాణి, జనగామ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, చదువుకున్న యువతకు నెలకు రూ.5,000 నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం తమ వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ సూపరింటెండెంట్ రవికిరణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ నరేందర్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత పట్ల ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షల పోస్టులతో పాటు రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగాలు, బ్యాక్‌లాగ్ పోస్టులు, 20 వేల పోలీసు ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జనగామ జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్‌తో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు రమేష్, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, బెల్లంకొండ వెంకటేష్, పోతుకునూరి ఉపేందర్, చిట్యాల సోమన్న, కౌన్సిలర్ బూడిద జ్యోతి, నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

# బకాయి లేకుండా విద్యుత్ బిల్లులు చెల్లించాలి : డీఈ సారయ్య

**పాలకుర్తి వాణి, స్టేషన్ఘన్‌పూర్ :** స్టేషన్ ఘనపూర్ మునిసిపల్ పట్టణ కేంద్రంలో ఎన్పిడిసీఎల్ డిఈ బి.సారయ్య పర్యవేక్షణలో,ఏడిఈ పి.రణధీర్ రెడ్డి సమక్షంలో ఏపిటియస్ సిబ్బందితో సహా ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలతో విద్యుత్ బకాయిల వసూలు కార్యక్రమం చేపట్టి 3లక్షల 40వేల విద్యుత్ బకాయిలను సిబ్బంది వసూలు చేశారు.ఈ కార్యక్రమంలో ఘనపూర్ ఏఈ పి.శంకర్,సబ్ ఇంజనీర్ సాధన,హరిత,ఎస్ఎల్ఐ ఎల్.రామాచారి,టౌన్ లైన్మెన్ వాసం శ్రీధర్,ఏఎల్ఎం నాగరాజు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341